క్లుప్తంగా

1న హనుమాన్ జయంతి



కోవెలకుంట్ల: జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీ సెంటర్, బనగానపల్లె చౌరస్తా, పాటిమీద ఆంజనేయ స్వామి, కోవెలకుంట్ల– నంద్యాల ఆర్అండ్బీ రహదారి పక్కన వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతిని పురస్కరించుకుని స్వామివారికి అభిషేకం, అర్చన, తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అర్చకుడు సుదర్శనాచార్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనచోదకుల రికార్డులను పరిశీలిస్తున్న తిమ్మరుసు నాయుడు

బనగానపల్లె రూరల్ : వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని నంద్యాల జిల్లా మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్(ఎంవీఐ) తిమ్మరుసు నాయుడు సూచించారు. మంగళవారం బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె, సాదుకొట్టం, పాతపాడు తదితర రహదారులలో ఆయన వాహనాల తనిఖీ చేశారు. భారీ లోడ్ వాహనాలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ఆటోల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ భారీ వాహనాలు నిబంధన మేరకు లోడ్ను తరలించాలని, డ్రైవర్లు లైసెన్స్తో పాటు బీమా కలిగి ఉండాలన్నారు.

‘భాష్యం’ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ ప్రభాకర్కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్ : ప్రభుత్వ అనుమతులు, పాఠశాల భవన నిర్మాణం పూర్తికాకుండానే నిబంధనలకు విరుద్ధంగా ఓ షాపులో అడ్మిషన్స్ నిర్వహిస్తున్న భాష్యం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంఈఓ ప్రభాకర్కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతి పత్రం అంజదేశారు. పుస్తకాలు, యూనిఫాంల పేర్లతో దోపిడీ చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ ఈ సందర్భంగా ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోజ్, శశిధర్ రెడ్డి, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో మంచినీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

కొలిమిగుండ్ల: గ్రామాల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు రామ్కో సిమెంట్ కంపెనీ ముందుకొచ్చింది. కంపెనీ సామాజిక బాధ్యత కింద కొలిమిగుండ్ల, మీర్జాపురం, చింతలాయిపల్లె గ్రామాల్లో ఐదు ట్యాంకర్లతో నీటి సరఫరా అందిస్తున్నారు. భూగర్భజలాలు అడుగంటి మంచినీటి సమస్య ఏర్పడటంతో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. మంచినీటికి ప్రత్యామ్నాయ మార్గాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఈనిర్ణయం తీసుకున్నామన్నారు. వర్షాలు కురిసి భూగర్భ జలాలు పెరిగే వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా అందిస్తామని చెప్పారు.

నాడు నేడు పనులు పూర్తి చేయాలి



మాట్లడుతున్న ఎంఈఓ రాజయ్య

సంజామల: నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓలు రాజయ్య, ఈశ్వరయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రం సంజామల ఎంఈఓ కార్యాలయంలో హెచ్ఎంలు, ఇంజినీర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని, వెంటనే పరిష్కార చర్యలు చేపడుతామన్నారు. నిర్లక్ష్యం వహించకుండా పనుల వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని హెచ్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ గౌస్, వివిధ పాఠశాలల హెచ్లు, ఇంజినీర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశువులకు ‘తొలకరి’ ముప్పు!

- గొంతువాపు వ్యాధి ప్రబలే ప్రమాదం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పశువు ప్రాణాలకే ముప్పు
- పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

డోన్ సబ్డివిజన్లో పశు సంపద వివరాలు	
తెల్ల, నల్లజాతి పశువులు	73,286
గొర్రెలు, మేకలు	9,431

డోన్ : పశువులకు తొలకరివాన ముప్పు పొంచి ఉంది. సూక్ష్మజీవుల మూలంగా కలిగే అతి ప్రమాదకరమైనది గొంతు వాపు వ్యాధి. తొలకరి వర్షాలు కురిసినప్పుడే ఈ వ్యాధి పశువులకు సంక్రమిస్తుంది. సాధారణంగా ఈ వ్యాధి గేదెలు, ఆవుల్లో కనిపిస్తుంది. అప్పుడప్పుడు గొర్రెలు, మేకలను సైతం వదలదు. ఎక్కువగా దూడలు, పడ్డల్లో ఈ వ్యాధిని మనం చూస్తుంటాం. ఈ వ్యాధి కలిగించే సూక్ష్మజీవులు ఈ సీజన్లో ఎక్కువగా తడినేలల్లో ఉంటాయి. తొలకరి వాన పడిన వెంటనే పశువుల్లో ఈ వ్యాధి రావడానికి ఆస్కారం ఉంటుంది. వానకాలంలో జోరీగలు, దోమకాటు మూలంగా ఒక పశువు నుండి ఇంకొక పశువుకు ఈ వ్యాధి సోకుతుంది. సూక్ష్మజీవుల మేత, నీటి ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశించినప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమిస్తుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన తర్వాత పదిరోజుల్లో సరైన చికిత్స అందకపోతే పశువు మృతి చెందే అవకాశం ఉంది. వేసవి కాలంలో సరైన మేత లేకపోవడం మూలంగా పశువులు నీరస పడటం, దూర ప్రయాణం చేసి అలసిపోవడం జరుగుతుంది. వ్యాధి నిరోధక శక్తి పశువులు కోల్పోతాయి. తొలకరి వర్షాలకు తడి ప్రదేశంలోని గడ్డిని మేయడం మూలంగా గొంతు వాపు సూక్ష్మజీవులు ఉత్తేజం చెంది ఈ వ్యాధి ప్రబలుతోంది.

వ్యాధి లక్షణాలు

గొంతు వాపు వ్యాధి మూడు రకాలుగా ఉంటుంది. 1. పర్అక్యూట్, 2. అక్యూట్, 3. క్రానిక్. పశువుల్లో తీవ్రమైన జ్వరం (106 నుండి 107ఎఫ్) ఉండడం, రెండు కళ్లు ఎర్రబడి నీరు కారడం, నోటి వెంట సొంగ కారడం, గొంతు కిందిభాగం నొప్పితో కూడిన వాపు కలిగివుంటాయి. ముందరి కాళ్లు వాపు రావడం, ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరడం, శ్వాస కష్టమై ఊపిరి ఆడకుండా ఉండిపోవడం, ఆయాసం పడడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. పశుపోషకులు వెంటనే గుర్తించి చికిత్స చేయించాల్సి ఉంటుంది. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊపిరాడక గురకతో పశువు 48 గంటల్లో చనిపోయే పరిస్థితి ఉంటుంది.

వ్యాధి నివారణ చర్యలు

వ్యాధి లక్షణాల మేరకు రక్తపరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారణ చేయాలి. వ్యాధి సోకిన పశువును మిగిలిన పశువులకు దూరంగా ఉంచాలి. వ్యాధి సోకిన పశువు సమీపంలో ఆరోగ్యవంతంగా ఉన్న పశువును మేపకుండా చూడాలి. పశుశాలను ఫినాయిల్ లేక క్రిసాల్ క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. వ్యాధితో చనిపోయిన పశువు సమీపాన చెత్త, చెదారాన్ని ఆరు అడుగులు లోతు తీసి సున్నం వేసి పాతపెట్టాలి. పశువులకు పోషక పదార్థాలతో కూడిన ఆహారం ఇచ్చి, ఎక్కువ వేడి, చలి, వర్షం నుంచి రక్షణ కల్పించాలి. పశువులకు యాంటిబయాటిక్ మందులు ఇవ్వడంతో పాటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి. గొంతువాపు సోకిన పశువుల్లో వ్యాధి నిరోధానికి అడ్జువెంట్ టీకా ఇప్పించాలి.



గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యశాఖ డాక్టర్ (ఫైల్)

పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలి



తొలకరి జల్లులు కురిసిన సమయంలో పశువులకు సంక్రమించే వ్యాధులపై పశుపోషకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. కంటికి కనపడని సూక్ష్మజీవులు అపరిశుభ్ర వాతావరణం మూలంగా పశువులకు గొంతు వాపు వ్యాధి, జబ్బవాపు సోకుతాయి. ఈ వ్యాధులతో పశునష్టం జరిగే ప్రమాదం ఉంది. తరచుగా పశువైద్యశాఖ అధికారులను సంప్రదించి వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ నాగరాజు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, డోన్

31 నుంచి హనుమాన్ జయంతి వేడుకలు



గౌరిపేటలో వెలసిన ఆంజనేయ స్వామి

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 31న, జూన్ 1వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ తెలిపారు. 31వ తేదీన 108 కళశాలతో ఆంజనేయ స్వామికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. జూన్ 1వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు 108 సార్లు హనుమాన్చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్ రెడ్డి

సంజామల : మండల పరిధిలోని ముక్కమల్ల, ఆకుమల్ల, ఆల్వకొండ క్రాస్ వద్ద మంగళవారం ఎస్ఐ రమేష్ రెడ్డి వాహనాల తనిఖీ నిర్వహించారు. కోవెలకుంట్ల, అవుకు, తాడపత్రికి వెళ్లే వాహనాలను ఆపి రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులులేని 16 వాహన చోదకులకు జరిమానా విధించామని ఎస్ తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇక్బాల్ ఉసేన్

కోవెలకుంట్ల: ప్రభుత్వ పాఠశాల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కో ఆర్డినేటర్లు ఇక్బాల్ ఉసేన్, లక్ష్మీదేవి సూచించారు. మంగళవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో మండలంలోని మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం సరఫరా చేయాలన్నారు. ఆహారం వండటానికి కావాల్సిన బియ్యం, పప్పుదినుసులు, నూనె, కూరగాయలు తదితర నిత్యావసరాలను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఫైర్సేఫ్టీ అధికారి, సీఆర్ఎంటీసీలు, ఎంఐఎస్, డీటీసీ పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

బేతంచెర్ల: జూన్ 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంఈఓలు సోమశేఖర్, జనార్ధన్ గౌడు సూచించారు. మంగళవారం పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుభ్రతతో కూడిన భోజనం తయారు విధానంపై ఐఎఫ్పీ ప్యానల్ ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని ఎంఈఓలు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు సురేష్, కిశోర్, ఆచారి పాల్గొన్నారు.

ఎండీఎం సిబ్బందికి శిక్షణ

అవుకు: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు (ఎండీఎం)కు ఎంఈఓలు శ్రీధర్రావు, వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వంటలు ఏవిధంగా చేయాలి, కావలసిన వస్తువులు, చేసే పద్ధతులను వివరించారు. అలాగే వంట చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం అందించటం, సుచి శుభ్రత పాటించడం తదితర విషయాలను ఆరోగ్య సిబ్బంది వివరించారు. అనంతరం నిర్వహకులకు వంటల పోటీలను నిర్వహించి, రుచికరంగా చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో సంగపట్నం హెచ్ఎం నాగూర్, ఆరోగ్య సిబ్బంది, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాలు నిషేధం



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

డోన్ టౌన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన జరుగుతున్న నేపథ్యంలో డోన్ పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్కుమార్, అస్రత్బాషాలు తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధమని, ప్రతిఒక్కరూ ఈ నిబంధన పాటించాలన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడళ్ళలో, సమస్యాత్మక కాలనీల ప్రజలతో వారు మాట్లాడారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అనవసరంగా బయటకు రాకూడదని, గుమి కూడి ఉండరాదన్నారు. నలుగురి కన్నా ఎక్కువ మంది గుమి కూడి ఉంటే అరెస్టు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలను సానుకూలంగా స్వీకరించాలని, గెలిచామని విజయోత్సవ సంబరాలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధం అన్నారు. అలాగే ఓడిపోయామన్న బాధలో కూడా ఏటువంటి చర్యలకు ఉపక్రమించినా వారిపై పోలీసు యాక్ట్ ఉపయోగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శరత్కుమార్రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

కౌంటింగ్ విధులపై అలసత్వం తగదు
–ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్ : ఎన్నికలు, కౌంటింగ్ విధులపై అలసత్వం వహించరాదని ఆర్ఓ, డోన్ ఆర్డీఓ మహేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం కౌంటింగ్ రోజు ఎన్నికల విధుల్లో పాల్గొనే సహాయ రిటర్నింగ్ అధికారులు, పీఓలు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ పక్రియ, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. ఈ నెల 31వ తేదీ శుక్రవారం కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించడంతో పాటు అవగాహన కలిగి ఉండాలన్నారు. జూన్4 తెల్లవారు జామున 5గంటలలోపు తమకు కేటాయించిన కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్ పక్రియ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు నిర్వహించాల్సిన విధులు, ఏజెంట్లతో వ్యవహరించాల్సిన తీరు, రౌండ్ రౌండ్కు నోటీసు బోర్డులో పొందుపర్చాల్సిన అంశాలను వివరించారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల తాహసీల్దార్లు మాధవకృష్ణారెడ్డి, ప్రతాప్రెడ్డి, జీవన్చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్మేళాను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగరాజు

అవుకు: నిరుద్యోగుల సౌకర్యార్థం నిర్వహించ జాబ్మేళాలు మంచి అవకాశాలని, సద్వినియోగం చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో వివిధ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్న ఉద్యోగం అయినా సరే వదులుకోకూడదని విద్యార్థులకు సూచించారు. జాబ్ మేళాకు 65 మంది విద్యార్థులు హాజరయ్యారని, అందులో అర్హత ఉన్న 33 మందిని రిక్రూటర్లు సెలక్ట్ చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రిక్రూటర్లు చెన్నకేశవ రెడ్డి, శ్రీధర్, ఐటీఐ సిబ్బంది అబ్బాస్ వలి, తిమ్మయ్య, విజయ్, సుప్రియలలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణుడు

ప్యాపిలి: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేయాలని ఈఓఆర్డీ బాలకృష్ణుడు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా కార్యదర్శులు వారికి అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వాటర్ ప్లాంట్ల వద్ద మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

కొలిమిగుండ్ల: జూన్4న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ రోజు గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ గోపీనాథ్రెడ్డి హెచ్చరించారు. మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పెట్నికోట మినహా అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా జరిగాయన్నారు. కౌంటింగ్ రోజు ఎవరూ గొడవలకు దిగరాదని చెప్పారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, వీధుల్లోకి వచ్చి బాణసంచా కాల్చడం, అల్లర్లు చేయడం వంటి పనులు చేయరాదన్నారు. ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిసే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఫలితాలు వెలువడే రోజు గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఇళ్లలోనే ఉండి ఎన్నికల ఫలితాలు చూసుకోవాలని, హంగు ఆర్భాటాలకు పోవద్దని సూచించారు.

ఐటీఐలో చేరడానికి దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరడానికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండేళ్ల వ్యవధి ట్రేడులు ఎలక్ట్రీషియన్ – 20, ఫిట్టర్ –20, ఎలక్ట్రానిక్ మెకానిక్ –24, ఏడాది వ్యవధితో కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ –48, వెల్డర్ –40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ చేరడానికి 10వ తరగతి పాస్, వెల్డర్కు మాత్రం 10వ తరగతి పాస్, ఫెయిల్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9849648456 నంబర్ను సంప్రదించాలని సూచించారు.

పెరిగిన ఆలయ ఆదాయం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఈఓ చంద్రశేఖర్రెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములు కౌలుకు ఇచ్చేందుకు నిర్వహించి బహిరంగ వేలంలో ఆలయానికి రూ.97,700 ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని సాదుకొట్టం గ్రామంలోని శ్రీరాముల దేవస్థానంలో ఆలయ చైర్మన్ తొట బుచ్చిరెడ్డి, ఏ కోడూరు గ్రూపు టెంపుల్స్ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయానికి సంబంధించి మొత్తం 89.47 ఎకరాలు కౌలుకు ఇచ్చేందుకు బహి రంగవేలం జరిగింది. 63.52 ఎకరాలను కౌలుకు పాటదారులు దక్కించుకోగా, కౌలు ద్వారా మొత్తం రూ.3,15,600 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. అయితే గతేడాది కంటే రూ.97.700 అదనపు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, సిబ్బంది ప్రసాద్, రమేష్ బాబు రైతులు తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలో ఈనెల 26న భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్రెడ్డి తెలిపారు. అరెస్ట్ వివరాలను మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వడ్డె రమణయ్య భవన నిర్మాణ పనులకు పోతుండేవాడు. మద్యం సేవించి తరచూ భార్య సుగుణమ్మతో గొడవ పడుతువచ్చాడు. ఈక్రమంలో కుమారులతో పాటు కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పంపడంతో అదే వీధిలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఒక్కడే ఉంటున్నాడు. పక్కన ఉంటున్నా ఇంటినుంచి బయటకు పంపించారనే ఉద్దేశంతో భార్యతో గొడవ పడుతూనే ఉండేవాడు. ఇంటి ముందు వీధిలో మంచంపై నిద్రిస్తున్న భార్యను తల,ముఖంపై పదునైన ఆయుధంతో విచక్షణా రహితంగా నరకడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అంకిరెడ్డిపల్లె సమీపంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద ఉన్న రమణయ్యను అరెస్ట్ చేశారు. కోవెలకుంట్ల మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో కర్నూలు జిల్లా జైలుకు తరలించామని సీఐ చెప్పారు.

నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పరిధిలోని దుర్గాపేట కాలనీతో పాటు బలపాలపల్లె గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు మంగళవారం పోలీస్ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. దుర్గాపేట కాలనీకి చెందిన ముద్దవరం శేషు నుంచి 50 లీటర్లు, తాళ్లూరి రామాంజనేయులు నుంచి 30లీటర్లు, బలపాలపల్లె గ్రామానికి చెందిన లొద్ద మద్దిలేటి నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్కు పంపినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

సంజామల: మండల పరిధిలోని కమలపురి గ్రామానికి చెందిన బందెల నడిపి సుబ్బదాసరి నుంచి 43 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద మద్యం బాటిళ్ల ఉన్నాయన్న సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నామన్నారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కొనసాగుతున్న అరెస్ట్లు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలో ఎన్నికల పోలింగ్ రోజు జరిగిన గొడవకు సంబధించి అరెస్ట్లు కొనసాగుతున్నాయి. మంగళవారం వైఎస్సార్సీపీకి చెందిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్రెడ్డి తెలిపారు. టీడీపీ, వైఎస్సార్సీపీ కార్యకర్తల మధ్య చోటు చేసుకొన్న గొడవలో రెండు కేసుల్లో ఇరువర్గాల నుంచి 54 మందిని అరెస్ట్ చేశామన్నారు.

మొరాయించిన బస్సు

డోన్ టౌన్ : గుత్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం గుత్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అనంతపురం నుండి కర్నూలుకు వెళ్తుండగా డోన్ బస్టాండ్కు చేరుకోగానే ఎయిర్ కంప్రెషర్ మరమ్మతులకు గురైంది. సమస్యను డ్రైవర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి డిపోలోని గ్యారేజీకి బస్సను తీసుకెళ్లారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరమత్తుల అనంతరం యథావిధిగా బస్సు కర్నూలుకు బయలుదేరింది.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఈశ్వరయ్య

సంజామల: 2024–25 సంవత్సరానికి సంబంధిన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందజేసేందుకు పాఠ్యపుస్తకాలు మండలానికి చేరాయి. ఈ మేరకు ఎంఈఓలు రాజయ్య, ఈశ్వరయ్య పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. మండలానికి 28816 పుస్తకాలు అవసరం కాగా ప్రస్తుతం 4057 పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పుస్తకాలను ఉన్నతాధికారులు త్వరలో కేటాయిస్తారని ఎంఈఓలు తెలిపారు.

బాలికలు ఆందోళన చెందొద్దు



బాలికలకు సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్యాపిలి: యుక్తవయసులో మార్పులు సహజమని బాలికలు ఆందోళన చెందకూడదని వైద్యసిబ్బంది మల్లేశ్వరి, నందిని, మహేశ్వరి సూచించారు. మండల పరిధిలోని నల్లమేకలపల్లి గ్రామంలో మంగళవారం రుతుక్రమం ఆరోగ్యం –పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రుతుక్రమంలో ఎదురయ్యే సమస్యలను బాలికలకు విశదీకరించారు. వ్యక్తిగత శుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, వైద్య సిబ్బంది శోభారాణి, చంద్ర, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశం

డోన్ టౌన్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి–2 రామనర్సప్ప తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. త్వరలో పున: ప్రారంభమయ్యే పాఠశాలల గురించి భోజన సదుపాయాలు, బిల్లులు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. హెచ్ఎంలు వంట ఏజెన్సీ నిర్వాహకులు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : డోన్ టౌన్ మూడవ ఫీడర్ పరిధిలో నూతనంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 2గంటల వరకు ప్రభుత్వ ఐటీఐ, రైతుమిత్ర కాలనీ, సాక్షి నివాస్, వెంకటనాయునిపల్లె రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎస్ రంగాపురం, వెంకటాంపల్లి, నల్లమేకలపల్లి, డి. రంగాపురం గ్రామాల్లో మంగళవారం పశువైద్య సిబ్బంది పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి, జబ్బవాపు వ్యాధి నివారణకు గ్రామాల వారీగా పశువులకు టీకాలు వేస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.